https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 315 ఆదివారం 1-2-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా? అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను... మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు 9989788438, 9505485656.

### సిట్ అధికారుల తీరు

# చట్టవిరుద్ధం

- బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు
- సుప్రీంకోర్టు తీర్పులను తుంగలో తొక్కారని ఆరోపణ
- నోటీసులు ఇచ్చే అధికారమే లేదని స్పష్టం
- రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనపై తీవ్ర అభ్యంతరం



**హైదరాబాద్, జనవరి 31**

సిట్ అధికారులు వ్యవహరించిన తీరు చట్టాలకు పూర్తిగా వ్యతిరేకమని, సుప్రీంకోర్టు తీర్పులను తుంగలో తొక్కినట్లేనని బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు తీవ్రంగా విమర్శించారు. సిట్ అధికారులకు నోటీసులు జారీ చేసే అధికారమే లేదని, తమ చర్యల ద్వారా తన రాజ్యాంగ హక్కులను కాలరాశారని కేసీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు సిట్ అధికారులకు రిప్లై లేఖ పంపించారు. తనకు గతంలో రెండు సార్లు ఇచ్చిన నోటీసులు చట్టవిరుద్ధమని, చట్టాలకు అతిక్రమించి జారీ చేశారని కేసీఆర్ లేఖలో స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బిజీగా ఉండటంతో మొదటి నోటీసుకు వేరే తేదీ ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. అలాగే అరవై ఐదు ఏళ్లు పైబడిన వ్యక్తులను వారు నివసించే చోటనే విచారించాలని చెప్పే సీఆర్పీసీ సెక్షన్ నూట అరవై నిబంధనలను సిట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. అదే విధంగా తదుపరి నోటీసులన్నీ ఎర్రవల్లిలోని తన ప్రస్తుత నివాసానికే పంపాలని స్పష్టంగా తెలియజేశానని కేసీఆర్ పేర్కొన్నారు. అయినప్పటికీ, రాత్రి తొమ్మిది గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు మీ సంతకంతో ఉన్న లేఖను నందినగర్ నివాసంలోని ఇంటి గోడకు అతికించినట్లు తెలిసిందని ఆక్షేపించారు. ఆ లేఖ సిట్ అధికారుల సూచనల మేరకే అతికించారంటే దానిని తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు. చట్టపరమైన అంశాలు ఎలా ఉన్నప్పటికీ, మాజీ ముఖ్యమంత్రిగా, ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడిగా, బాధ్యతాయుతమైన భారత పౌరుడిగా దర్యాప్తుకు సహకరించాలని నిర్ణయించుకున్నట్లు కేసీఆర్ వెల్లడించారు. సిట్ అధికారులు నందినగర్ నివాసంలోనే స్టేట్‌మెంట్ నమోదు చేయాలని పట్టుబట్టినందున, రేపు మధ్యాహ్నం మూడు గంటలకు నందినగర్‌లో అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. సిట్ అధికారుల చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొంటూ, చట్ట పరిధిలోనే విచారణ జరగాలని కేసీఆర్ డిమాండ్ చేశారు.

# వన ప్రవేశం చేసిన వన దేవతలు

### ముగిసిన మేడారం మహా జాతర.. రెండు కోట్ల మంది భక్తుల రాక..



దేశం నలుమూలల నుండి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించారు. శనివారం ఇద్దరు తల్లులు కన్నెపల్లికి సారలమ్మ, చిలకలగుట్టకు సమక్క, పగిడిద్దరాజు, గోవిందరాజులను గద్దెలపై నుంచి ఆదివాసీ పూజారులు వారి వారి ఆలయాలకు తీసుకెళ్లారు. సమ్మక్క ప్రతిరూపమైన కుంకుమభరిణెతో సాయంత్రం ప్రారంభమై సూర్యాస్తమయం తర్వాత పూజారులు రాత్రి 7.55 నిమిషాలకు వన ప్రవేశం చేయడంతో జాతర ముగిసింది.







**మేడారం, జనవరి 31**

బుధవారం సారలమ్మ రాక తర్వాత మహాజాతర లాంఛనంగా ప్రారంభమై, ఆ మరుసటి రోజు సమ్మక్కను గద్దెపైకి తీసుకురాగా.. శుక్రవారం, శనివారం అశేష భక్త జనం వన దేవతలకు మొక్కులు సమర్పించారు. భక్తులు పోటెత్తడంతో మేడారం జనజాతరను తలపించింది. భక్తులు జంపన్న వాగులో పుణ్య స్నానాలు చేసి.. బంగారం తులా భారం, మొక్కులు సమర్పించారు. జాతర నేపథ్యంలో.. భక్తిశ్రద్ధలతో వనదేవతలకు

# హార్వర్డ్‌లో సీఎం రేవంత్ రెడ్డి విస్తృత చర్చలు

- విద్యార్థులు, అలుమ్నీలతో నాయకత్వం, అభివృద్ధిపై సంభాషణ
- తెలంగాణ రైజింగ్--2047 దృష్టిని వివరించిన సీఎం - తెలంగాణ గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్లుగా నిలవాలని పిలుపు



**కేంబ్రిడ్జ్-బోస్టన్, జనవరి 31**

అమెరికాలోని మసాచుసెట్స్ రాష్ట్రం కేంబ్రిడ్జ్--బోస్టన్‌లో ఉన్న హార్వర్డ్ యూనివర్సిటీలో తన అధికారిక కార్యక్రమాల ముగింపు రోజున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విస్తృత స్థాయిలో చర్చలు నిర్వహించారు. హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన వివిధ విభాగాల విద్యార్థులు, అలుమ్నీలతో పాటు ఎంఐటీ, కొలంబియా యూనివర్సిటీల విద్యార్థులు, పూర్వ విద్యార్థులతో సీఎం సుదీర్ఘంగా పరస్పరం మాట్లాడారు. ఈ సమావేశాల్లో నాయకత్వం, విజయం, ఆర్థిక వృద్ధి, అభివృద్ధి నమూనాలు, స్థిరత్వం, పర్యావరణ సవాళ్లు, రైతులు, మహిళలు, యువత కేంద్రంగా అమలు చేస్తున్న సంక్షేమ విధానాలు వంటి కీలక అంశాలపై విస్తృత చర్చ జరిగింది. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సీఎం స్పష్టంగా స్పందిస్తూ పాలనలో ఎదురయ్యే సవాళ్లు, మార్పు తేవడంలో నాయకత్వ పాత్రపై తన అనుభవాలను పంచుకున్నారు. తెలంగాణ భవిష్యత్ దృష్టి అయిన తెలంగాణ రైజింగ్-2047 గురించి సీఎం రేవంత్ రెడ్డి వివరిం చారు. ఈ దృష్టి ద్వారా సమగ్ర వృద్ధి, భాగస్వా మ్య అభివృద్ధి, సాధికారతకు ఎలా అవకాశాలు ఏర్పడతాయో వివరించారు. పాలనలో పారద ర్శకత, ప్రజల భాగస్వామ్యమే తన దీర్ఘకాలిక లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. నాయకత్వం, దృష్టిపై బోధించాలని కొందరు విద్యార్థులు కోరినప్పుడు, అలాంటి బోధన హార్వర్డ్‌లోని ప్రతిష్టాత్మక అధ్యాపకులకే తగినదని సీఎం వ్యాఖ్యానించారు. తాను "నకిలీ ప్రొఫెసర్" పాత్రలో ఉండాలనుకోవడం లేదని, పరస్పర సంభాషణ, అనుభవాల పంచకం, పరస్పర అభ్యాసమే తనకు ఇష్టమని తెలిపారు. భారతదేశ భవిష్యత్తుపై ఆశావహ దృక్పథాన్ని వ్యక్తం చేసిన సీఎం, తెలంగాణ, హైదరాబాద్ దేశానికి మార్గదర్శకంగా నిలుస్తాయని చెప్పారు. విద్యార్థులు, అలుమ్నీలు భారత అభివృద్ధి ప్రయాణంతో అనుసంధానమై ఉండాలని, తెలంగాణ రైజింగ్‌కు గ్లోబల్ బ్రాండ్ అంబాసి డర్లుగా నిలవాలని పిలుపుని చ్చారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు, అలుమ్నీలు తెలంగాణ అభివృద్ధికి తమ నైపుణ్యాన్ని, అనుభవాన్ని వినియోగించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

## మహారాష్ట్ర డీసీఎంగా ప్రమాణస్వీకారం చేసిన సునేత్ర పవార్



ముంబై: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేత, రాజ్యసభ ఎంపీ, దివంగత అజిత్ పవార్ సతీమణి సునేత్ర పవార్ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా శనివారంనాడు ప్రమాణ స్వీకారం చేశారు. ముంబైలోని లోక్‌భవన్ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ఆమె చేత ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, మరో ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, మహాయుతి మంత్రులు, ఇతర నేతలు పాల్గొన్నారు. ఎన్‌సీపీ (ఎస్‌పీ) నేతలు శరద్ పవార్, ఆ పార్టీ ఎంపీ సుప్రియా సూలే ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. సునేత్ర పవార్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో రాష్ట్రంలో ఆ పదవిని చేపట్టిన తొలి మహిళగా ఆమె గుర్తింపు పొందారు. అజిత్ పవార్ ఇటీవల విమాన ప్రమాదంలో మరణించడంతో ఆయన స్థానంలో డిప్యూటీ సీఎం పగ్గాలను సునేత్ర చేపట్టారు. దీనికి ముందు, శనివారం ఉదయం ఎన్‌సీపీ శాసనసభాపక్ష నేతగా సునేత్ర పవార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లెజిస్లేటివ్ బిల్డింగ్‌లో జరిగిన సమావేశంలో సునేత్ర పేరును ఎమ్మెల్యే దిలీప్ వాల్సే పాటిల్ ప్రతిపాదించగా, ఎన్‌సీపీ మంత్రి ఛగన్ భుజ్ బల్ బలపచారు. అనంతరం ఏకగ్రీవంగా పార్టీ శాసనసభాపక్ష నేతగా సునేత్ర ఎన్నికయ్యారు. సునేత్ర పవార్ డిప్యూటీ సీఎం పదవితో చేపట్టంతో అజిత్ పవార్ చేపట్టిన శాఖలను కూడా ఆమెకు అప్పగించనున్నారని తెలుస్తోంది. అయితే అజిత్ పవార్ చేతిలోని ఆర్థిక శాఖను మాత్రం ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తన వద్దే ఉంచుకోనున్నారని, దీనికి బదులుగా మరో శాఖను ఆమెకు అప్పగిస్తారని తెలుస్తోంది.

## హైదరాబాద్ కోఠిలో
# కాల్పుల కలకలం

- ఎస్‌బీఐ ఏటీఎం వద్ద గన్‌తో కాల్పులు, రూ.6 లక్షల దోపిడీ
- డబ్బులు డిపాజిట్ చేసేందుకు వచ్చిన రషీద్‌పై దాడి
- సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు



**హైదరాబాద్, జనవరి 31**

హైదరాబాద్‌లోని కోఠి ప్రాంతంలో కాల్పుల ఘటన తీవ్ర కలకలం రేపింది. కోఠిలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం వద్ద దుండగులు గన్‌తో కాల్పులు జరిపి ఆరు లక్షల రూపాయల నగదుతో పరారైనట్లు పోలీసులు తెలిపారు. డబ్బులు డిపాజిట్ చేసేందుకు ఏటీఎం వద్దకు వచ్చిన రషీద్‌పై దుండగులు కాల్పులు జరిపినట్లు సమాచారం. ఈ ఘటనలో రషీద్‌కు గాయాలు కావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితిపై వైద్యులు చికిత్స అందిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న సుల్తాన్ బజార్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఏటీఎం పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తూ దుండగుల కదలికలను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.

## 45 రోజుల్లోగా సరిహద్దుల్లో కంచె,
# అవినీతిపరులకు జైలు : అమిత్‌షా



కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ (మీుఎమ్ఞు దీుఅవతీయవవ) పాలనపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా (ూఎఱ్ వాష్ట్రుష్ట్ర) తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని, అవినీతి పరులను ఒకరి తరువాత మరొకరిని జైలుకు పంపుతుందని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అక్రమ చొరబాట్లకు కళ్లెం వేస్తూ 45 రోజుల్లోనే రాష్ట్రంలో సరిహద్దు కంచె వేస్తామని చెప్పారు. ఉత్తర 24 పరిగణాల జిల్లా బ్యారక్‌పూర్‌లో శనివారంనాడు జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో అమిత్‌షా మాట్లాడుతూ, 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 39 శాతం ఓట్ షేర్ సాధించిందని, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో 77 సీట్లు గెలుచుకుని 38 శాతం ఓట్ షేర్ రాబట్టిందని గుర్తుచేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పూర్తి మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, 50 శాతానికి పైగా ఓట్లను బీజేపీకి గెలుచుకుంటుదని ధీమా వ్యక్తం చేశారు. తృణమూల్ కాంగ్రెస్ అవినీతిలో కూరుకుపోయిందని, కోల్‌కతాలోని ఆనందపూర్‌లో జరిగిన ఫ్యాక్టరీ ప్రమాదంలో 25 మంది వర్కర్లు అగ్నికి ఆహుతికావడానికి మమతాబెనర్జీ ప్రభుత్వానిదే బాధ్యతని, అది ఎంతమాత్రం ప్రమాదం కాదని, మమత అవినీతే ఈ విషాద ఘటనకు కారణమని ఆరోపించారు. అవినీతిని మమతా సర్కార్ వ్యవస్థీకృతం చేసిందని, రూ. 1,000 కోట్లకు పైగా అవినీతి జరిగినా చూసీచూడనట్టు ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వివిధ అవినీతి ఆరోపణలపై టీఎంసీ నేతలు జైళ్లలో ఉన్నారని, ఈసారి కూడా వారికి టిక్కెట్లు ఇస్తారా? అని అమిత్‌షా ప్రశ్నించారు. అవినీతి అంశాల్లో తన మేనల్లుడి పేరు బయటకు రాకుండా జైలులో ఉన్న నేతలందరికీ మమతాబెనర్జీ టిక్కెట్లు ఇవ్వనున్నారని అన్నారు. బెంగాల్ చొరబాట్లు దేశభద్రతకే ప్రమాదంగా పరిణమించనున్నట్టు చెప్పారు.

## విజయ్ ఓట్లు చీల్చే వ్యక్తే కానీ కింగ్ కాలేరు..
### కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్



న్యూఢిల్లీ: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో నటుడు విజయ్ తమిళగ వెట్రి కళగం తో బీజేపీ పొత్తు అవకాశాలు, రాజకీయాల్లో విజయ్ ప్రభావం ఏమేరకు ఉండనుందనే అంశాలపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. విజయ్ టీవీకేతో బీజేపీ కలిసే ప్రసక్తే లేదని చెప్పారు. విజయ్ కేవలం ఓట్లు చీల్చే వ్యక్తిగా మిగిలిపోతారని, కింగ్ మాత్రం కాలేరని అన్నారు. గతంలోనూ చాలా మంది సినీనటులు రాజకీయాల్లోకి అడుగుపెట్టారని, అయితే ఎలాంటి ప్రభావం చూపించలేక పోయారని గుర్తు చేశారు. 'విజయ్ ఓట్లు చీల్చవచ్చు.. కింగ్ మాత్రం కాలేరు. గతంలో చాలా మంది నటులు వచ్చారు, వెళ్లారు. ఆ పార్టీతో బీజేపీ పొత్తుకు అవకాశం లేదు. బీజేపీ-అన్నాడీఎంకే కూటమి అద్భుతమైన విజయాన్ని సాధిస్తుందన్నారు.

# సివిల్ సర్వీసుల్లో అగ్నిపరీక్షలు

జీవితంలో ఎప్పుడూ రెండు దార్లు మన ముందుంటాయి. ఒకటి విశాలమైనది- సులభంగా వెళ్ళగలిగినదే కానీ వినాశనం వైపు నడిపిస్తుంది. రెండవది ఇరుకైన దారి- వెళ్ళడం కష్టమే అయినా జీవితాన్ని గౌరవప్రదంగా, ప్రశాంతంగా సాగించే అవకాశాన్నిస్తుంది. నేను పదవీ విరమణ చేసి పదిహేనేళ్ళు అయ్యింది. ఈ కాలంలో నాకు బాగా సంతృప్తినిచ్చిన పని- సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమయిన మార్గదర్శనం చేయడం. ఆ ప్రయత్నాల్లో భాగంగా నేను వాళ్ళకు ప్రధానంగా చేసే సూచన- నిజాయితీ, నైతిక ప్రవర్తనల గురించే. ఆకర్షణీయమైన జీతభత్యాలు, సమాజంలో హోదా, గుర్తింపులు మాత్రమే కాదు, మరే ఇతర వృత్తిలో లేని విధంగా- ఒక మంచి పని చేసే అవకాశం, అధికారం సివిల్ సర్వీసు ఉద్యోగికి ఎప్పుడూ చేతిలో ఉంటాయి. అఖిల భారత సర్వీసు ప్రాముఖ్యాన్ని మన రాజ్యాంగం మాత్రమే ప్రస్తావించింది. ప్రపంచంలో మరే దేశ రాజ్యాంగంలో కనపడని ప్రత్యేకత ఇది. ఇంత తిరుగులేని ఆకర్షణ, దానికి తోడు పూర్తి భద్రత మీకు అండగా ఉన్నప్పుడు... ఇక భయమెందుకు? ప్రలోభాల కోసం కక్కుర్తి ఎందుకు? అని అడుగుతుంటా ఆ యువతీయువకులను, కాబోయే సివిల్ సర్వీస్ అధికారులని. రాజకీయాలు, అకౌంటెన్సీ, న్యాయ వ్యవహారాలు, వైద్యం, వ్యాపారం, పరిశ్రమలు, వైజ్ఞానిక రంగం... సివిల్స్ మాత్రమే కాదు... ఏ రంగంలో అయినా ఈ రెండు అడ్డంకులూ అనుక్షణం అగ్నిపరీక్షలు పెడుతూనే ఉంటాయి. ఈ సవాళ్ళను అధిగమించే సామర్థ్యం మీరు ప్రదర్శిస్తే... అది మీ వృత్తి జీవితాన్ని ఫలప్రదం చేయడంతో పాటూ సమాజంలో మీకో ఉన్నత స్థానం కల్పిస్తుంది, అని వాళ్ళకి చెబుతూ ఉంటాను. మన దేశం చేసుకున్న అదృష్టం ఏమిటంటే... ప్రతి రంగంలోనూ ఎక్కువ మంది బాగా కష్టపడతారు. నీతి, నిజాయితీతో మెలగుతుంటారు. దేశం పట్ల, ప్రజల పట్ల ప్రేమాభిమానాలతో పనిచేసే వాళ్ళయి ఉంటారు. అదృష్టవశాత్తూ నేను కూడా ఈ కోవకు చెందినవాడిగానే భావించుకుంటా. ప్రలోభాలు, ఒత్తిడులు నా ఉద్యోగ జీవితంలో ఎన్నోసార్లు నాకు అగ్నిపరీక్ష పెట్టాయి. రాష్ట్రపతిగా ఉన్న జ్ఞానీ జైల్‌సింగ్ గుండె ఆపరేషన్ కారణంగా 45 రోజులు విధులకు దూరంగా ఉండాల్సి వచ్చింది. అప్పుడు ఉప రాష్ట్రపతిగా ఉన్న హిదాయతుల్లాని ఆయన స్థానంలో పనిచేయమన్నారు.

అంటే రాష్ట్రపతి హోదాలో.. అని హిదాయతుల్లా గారి భావన. (గతంలో ఆయన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు.. రాష్ట్రపతి పదవికి వి.వి.గిరి రాజీనామాతో ఖాళీ ఏర్పడింది. అప్పుడు హిదాయతుల్లాను తాత్కాలిక రాష్ట్రపతిగా విధులు నిర్వర్తించమన్నారు. తాత్కాలిక రాష్ట్రపతి.. అన్న పదవి రాజ్యాంగంలో ఉండదు అని చెప్పి... రాష్ట్రపతి హోదాలోనే ఆ విధులు నిర్వర్తించారు. దాంతో ఇది కూడా అలాగే అని ఆయన అభిప్రాయపడి ఉండవచ్చు.) అప్పుడు ఆయనకు సెక్రటరీగా ఉన్న నేను దానితో విభేదించాను. గతంలో లాగా ఇప్పుడా పదవి ఖాళీ కాలేదు, కాబట్టి జైల్ సింగ్ తిరిగొచ్చేదాకానే కాబట్టి.. 'రాష్ట్రపతి విధులు నిర్వర్తించే ఉపరాష్ట్రపతి' గానే మీరుంటారు... అని స్పష్టం చేసాను. దానికి ఆయన వెటకారంగా "అంటే నేను వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా డిస్చార్జింగ్ ది డ్యూటీస్ ఆఫ్ ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా... అని రబ్బరు స్టాంపు తయారు చేయించుకుని సంతకాలు పెట్టాలా?" అని అడిగారు. అప్పుడు నేను- "జైల్ సింగ్ పదవిలో ఉన్నప్పుడే మీరు కూడా రాష్ట్రపతి హోదాలో ఉండడం.. అంటే ఇద్దరు రాష్ట్రపతులు ఉన్నట్లు కదా.. దానికి రాజ్యాంగం ఒప్పుకోదు కదా!" అని చెప్పి వచ్చేసాను. అప్పుడు లా సెక్రటరీగా ఉన్న పేరిశాస్త్రిని ఉపరాష్ట్రపతి సంప్రదిస్తే.. "ఈ విషయంలో ఈ అధికారి తెలిపిందే కరెక్ట్" అని చెప్పారు. హిదాయతుల్లాకు నా సలహా రుచించకపోవచ్చు, ఆయన నొచ్చుకుని కూడా ఉండవచ్చు. కానీ ఆయనంటే నాకు అపారమైన గౌరవం. ఆయన పండితుడు, పెద్దమనిషి, నిజాయితీపరుడు... అయినా మేం రూల్స్‌కు బందీలం కదా! రేపు చరిత్రకారులు హిదాయతుల్లా వంటి వారిని నిందించకుండా కాపాడవలసిన గురుతర బాధ్యత మామీదే ఉంటుంది కదా! ఒకసారి ముఖ్యమంత్రి చంద్రబాబు పిలిపిస్తే కేంద్ర సర్వీసులో ఉన్న నేను రాష్ట్రానికి తిరిగివచ్చి ప్రధాన కార్యదర్శిగా పదవిని చేపట్టిన మొదటి వారంలోనే.. ఒక చిన్న విషయంపై ఆయనతో ముఖాముఖి తలపడాల్సి వచ్చింది. అలవాటు ప్రకారం ఆయన చాలా విసుగ్గా "మీ హనీమూన్ (పదవి తాలూకు కొత్తదనం) ముగిసింది. ఇక పనిమీద శ్రద్ధపెడితే మంచిది. ఇక్కడ ప్రతిదీ తలాతోక లేకుండా గందరగోళంగా ఉంది" అనడంతో అవాక్కయ్యా. ఆత్మాభిమానం దెబ్బతినడంతో రోషాన్ని నిగ్రహించుకుంటూ "నేనెప్పుడూ చీఫ్ సెక్రటరీ పదవి కావాలని తాపత్రయపడలేదు" అన్నాను. ఆయన ఏడేళ్ళ పదవీకాలంతో పోలిస్తే నేను అక్కడికి వెళ్ళి వారం రోజులు కూడా కాలేదు. అప్పటివరకూ నేనెప్పుడు మా అమ్మానాన్నలతో కానీ, టీచర్ల దగ్గర కూడా ఇలా మాటలు పడలేదు. "ఇప్పటికి నా సర్వీసు 35 ఏళ్ళు పూర్తయింది. మహా అయితే మరో రెండేళ్ళు మిగిలి ఉందేమో. దాన్ని కూడా వదులుకుని హాయిగా... గడచిన సర్వీసుకాలపు జ్ఞాపకాలతో రిటైరయిపోతా. ఇప్పటికిప్పుడే నా రాజీనామా ఇచ్చేస్తా" అని చాలా ప్రశాంతంగానే అయినా విస్పష్టంగా చెప్పి బయటకు వచ్చేశా. ఆయన నొచ్చుకున్నట్లున్నారు. వెంటనే ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్వీ ప్రసాద్‌ను నా వెనకే పంపారు. ఆ చర్చలప్పుడు ప్రసాద్ కూడా అక్కడే ఉన్నారు. ప్రసాద్ నాకు సర్దిచెప్పి తిరిగి అక్కడికి తీసుకెళ్ళారు. ఇష్టం లేకపోయినా వెళ్ళా. ముఖ్యమంత్రి చిరునవ్వు నవ్వి, జరిగిన దానికి పశ్చాత్తాప ధోరణిలో.. "నాకు మరో ఉద్దేశం ఏదీ లేదు. ఆ మాటలను నేను మీరనుకున్న అర్థంలో అనలేదు. ఒకవేళ మిమ్మల్ని మనస్తాపానికి గురి చేసి ఉంటే సారీ. వాటిని పట్టించుకోకండి. మీ పని మీరు చేసుకోండి. నా సపోర్టు మీకు ఎంతగా ఉంటుందో మీరే చూస్తారు" అన్నారు. అప్పటికి నేను కూడా చల్లబడ్డా.. అంతకుముందు తొందరపడి నేనలా అతిగా ప్రవర్తించినందుకు నొచ్చుకున్నా. మేం షేక్ హ్యాండ్ ఇచ్చుకున్నాం. దాని తరువాతే ప్రధాన కార్యదర్శిగా నా అసలు విధి నిర్వహణ మొదలయింది. సాధారణంగా ప్రభుత్వ ఫైళ్ళు రెండు రకాలుగా ఉంటాయి... ఒకటి కరెంట్ ఫైల్- అంటే నడుస్తున్న విషయానికి సంబంధించిన సంప్రదింపులతో ఉండేది. మరొకటి నోట్ ఫైల్-- దానిని పరిశీలించిన వారి అభిప్రాయాలు, సిఫార్సులు, తుది నిర్ణయం వంటివి ఉంటాయి.

# అక్షర సేద్యమా..
# అక్రమ వసూళ్లా?

## జర్నలిజం ముసుగులో 'కలెక్షన్' దందా..

### నైతిక విలువలు పాతాళానికి!



**పార్వతి సురేష్ కుమార్**
సీనియర్ జర్నలిస్ట్
మంచిర్యాల

సమాజానికి దిశానిర్దేశం చేయాల్సిన నాలుగో స్తంభం కుప్పకూలుతోంది. ప్రజాస్వామ్యానికి రక్షణ కవచంలా నిలవాల్సిన జర్నలిజం.. నేడు కొందరి చేతుల్లో 'వసూళ్ల' సాధనంగా మారుతోంది. వ్యవస్థలోని లొసుగులను ఎండగట్టాల్సిన కలం.. అవినీతి తిమింగలాలతో చేతులు కలిపి అక్షరాన్ని తాకట్టు పెడుతోంది. అంకితభావంతో పనిచేసే జర్నలిస్టుల ముసుగులో చొరబడిన కొందరు 'బ్లాక్ మెయిలర్లు' మీడియా రంగానికి పట్టిన చీడపురుగులుగా తయారయ్యారు.

**అవినీతికి అండగా.. అక్షరం తోడుగా!**

ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం పక్కన పెట్టి, ఎక్కడ తప్పు జరిగితే అక్కడ వాలిపోతూ 'కలెక్షన్' బేరసారాలు సాగించడం నేటి దారుణ పరిస్థితికి అద్దం పడుతోంది. కార్పొరేషన్ కార్యాలయాల నుంచి కింది స్థాయి ప్రభుత్వ ఆఫీసుల వరకు ఈ 'వసూళ్ల మీడియా' ప్రతినిధుల సంచారం పెరిగిపోయింది. తప్పులు సరిదిద్దాలని డిమాండ్ చేయాల్సిన వారు.. ఆ తప్పులను కప్పిపుచ్చడానికి రేటు కడుతున్నారు. ఫలానా వార్త రాస్తే మీ పరువు పోతుంది.. ఇంత ఇస్తే ఆ వార్తను తొక్కిపెడతాం అంటూ సాగే బెదిరింపులు జర్నలిజం ప్రతిష్టను బజారున పడేస్తున్నాయి.

**ప్రశ్నించే గొంతుకకు..**
**ముడుపుల ఉరితాళ్లు**

నిజాయతీగా వార్తలు రాసే జర్నలిస్టులకు నేడు సమాజంలో రక్షణ కరువవుతోంది. ఒకవైపు వ్యవస్థలోని లోపాలతో పోరాడుతూనే, మరోవైపు తోటి వృత్తిలోని నకిలీల వల్ల కలుగుతున్న అపఖ్యాతిని వారు భరించాల్సి వస్తోంది. పగలు, రాత్రి కష్టపడి వార్తల కోసం అన్వేషించే విలేకరి కంటే.. అధికార యంత్రాంగంతో కుమ్మక్కై వసూళ్లు చేసే వారికే గౌరవం దక్కడం విచారకరం. ఈ ధోరణి వల్ల సామాన్యుడికి మీడియాపై ఉన్న నమ్మకం సడలిపోతోంది. అడిగే వారు లేరనే ధీమాతో ఈ ముఠాలు చెలరేగిపోతున్నాయి.

**వ్యాపారంగా మారిన వృత్తి ధర్మం**

జర్నలిజం అనేది ఒక సేవ మాత్రమే కాదు.. అదొక సామాజిక బాధ్యత. కానీ నేడు అది లాభసాటి వ్యాపారంగా రూపాంతరం చెందింది. అక్షరం పలకాల్సిన చోట నోట్ల కట్టలు మాట్లాడుతున్నాయి. ప్రజా సమస్యల కంటే వ్యక్తిగత బ్యాంక్ బ్యాలెన్స్‌లకే ప్రాధాన్యత పెరిగింది. పత్రికా స్వేచ్ఛను అడ్డం పెట్టుకుని సాగిస్తున్న ఈ అరాచక పర్వం వల్ల నిజమైన జర్నలిస్టులు తలదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జర్నలిజం విలువలకు తిలోదకాలు ఇచ్చి, కేవలం ధనార్జనే ధ్యేయంగా పనిచేసే వారు ఈ రంగానికే శత్రువులు.

**ప్రక్షాళన జరగాల్సిందే!**

మీడియా రంగం ఇప్పుడు తీవ్రమైన నమ్మక సంక్షోభంలో ఉంది. ఈ గడ్డు కాలాన్ని అధిగమించాలంటే వ్యవస్థలో సమూల మార్పులు రావాలి. వృత్తి మర్యాదను కాపాడే బాధ్యత కేవలం యాజమాన్యాలదే కాదు, ప్రతి జర్నలిస్టుది కూడా. వసూళ్లకు పాల్పడే వారిని సామాజికంగా బహిష్కరించడంతో పాటు, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. నిజాయతీకి నిలువుటద్దంగా ఉండాల్సిన మీడియా.. తనను తాను శుభ్రం చేసుకున్నప్పుడే ప్రజల పక్షాన నిలబడే నైతిక హక్కును కలిగి ఉంటుంది. లేనిపక్షంలో కలం పదును తగ్గి.. కేవలం కాగితపు పులిగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.

# సింగరేణి పరిరక్షణ కోసం
# కమ్యూనిస్టులతో కలిసి పోరాడుతాం

### మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్


**రామకృష్ణాపూర్, జనవరి 31, (మన సమాజం) :** సింగరేణి పరిరక్షణ కోసం కమ్యూనిస్ట్ పార్టీ సిపిఐ తో కలిసి పోరాటాలకు తాము సిద్ధంగా ఉన్నామని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. స్థానిక బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సిపిఐ నాయకులతో కలిసి శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కార్మికుల హక్కులు మాయమవుతున్నాయని, కార్మిక క్షేత్రాన్ని కాపాడుకోవడానికి నిరంతరాయంగా ఏఐటియుసి పోరాటం చేస్తుందని, ప్రస్తుత పరిస్థితుల్లో కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై కమ్యూనిస్ట్‌లతో కలిసి ముందుకెళుతున్నామని తెలిపారు. సింగరేణి ఉనికికి కాంగ్రెస్ ప్రభుత్వంతో ప్రమాదం వాటిల్లుతుందని ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు సీతారామయ్య అన్నారు. గత ఎన్నికల సమయంలో కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో క్యాతనపల్లి అభివృద్ధికోసం బిఆర్ఎస్, సిపిఐ పొత్తులతో ముందుకెళుతుందని వారు చెప్పారు. ప్రజలందరు బిఆర్ఎస్, సిపిఐ పార్టీల అభ్యర్థులకు బారి మెజార్టీ ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ పల్లె భూమేష్, నాయకులు డా. రాజరమేష్, పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్ గౌడ్, మేడిపల్లి సంపత్, సిపిఐ నాయకులు కలవేన శంకర్, రామడుగు లక్ష్మణ్, మిట్టపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.




# హార్వర్డ్ కెనెడీ స్కూల్ ఏఐ పాలసీ
# సింపోజియానికి సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం

- తొలి ఏఐ పాలసీ సింపోజియంలో పాల్గొననున్న ఏకైక భారతీయ నేత
- డీన్ జెరెమీ వెయిన్‌స్టీన్‌తో కలిసి ప్రారంభించనున్న సీఎం

**కేంబ్రిడ్జ్ (అమెరికా), జనవరి 31**
హార్వర్డ్ కెనెడీ స్కూల్ నిర్వహించ నున్న తొలి ఏఐ పాలసీ సింపోజి యంలో పాల్గొనాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నిర్వాహకులు అధికారికంగా ఆహ్వానం అందించారు. మార్చి నెలలో జరగ నున్న ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో ప్రసంగించేందుకు ఆహ్వానించబడిన ఏకైక భారతీయ నేతగా సీఎం రేవంత్ రెడ్డి నిలవడం విశేషంగా మారింది. ఈ సింపోజియాన్ని హార్వర్డ్ కెనెడీ స్కూల్ డీన్ జెరెమీ వెయిన్‌స్టీన్తో కలిసి ప్రారంభించాల్సిందిగాముఖ్య మంత్రిని నిర్వాహకులు కోరారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ పాలసీ, పాలన, సాంకేతిక భవిష్యత్‌పై కీలక చర్చలకు వేదికగా ఈ సింపోజియం నిలవనుంది. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి మాట్లాడుతూ, భారతదేశంలోని హైదరాబాద్ నుంచి వర్చువ ల్‌గా కీలక ప్రసంగం ఇవ్వడాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఏఐ మౌలిక వసతులు, విధాన పర మైన రూపకల్పనలపై గ్లోబల్ నాయ కులు, ప్రముఖ టెక్నాలజీ ఆలోచన వేత్తలతో కలిసి ఉన్నత స్థాయి ప్యానల్ చర్చలో పాల్గొనే అవకాశముందని పేర్కొన్నారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఈ



ఆహ్వానాన్ని నిర్వాహక బృందసభ్యురాలు రుక్సాండా రెనిటాతో పాటు ఇతర సభ్యులు ముఖ్యమంత్రికి ప్రత్యక్షంగా అందజేశారు. తెలం గాణ రైజింగ్-2047 దృష్టిలో భాగంగాఏఐ పాలసీ, ఇన్నోవేషన్ రంగాల్లో తెలంగాణ ప్రపంచానికి మార్గద ర్శకంగా నిలవా లన్న ప్రభుత్వ లక్ష్యా నికి ఈ ఆహ్వా నం మరో గుర్తింపుగా విశ్లేషిస్తున్నాయి.

## కోఠి కాల్పుల ఘటనపై డీసీపీ శిల్పవల్లి కీలక వివరాలు

- ఎస్బీఐ ఏటీఎం వద్ద నగదు డిపాజిట్ సమయంలో దాడి
- ఆరు లక్షల నగదు, బైక్‌తో పరారైన దుండగులు
- ఐదు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు



**హైదరాబాద్, జనవరి 31**

హైదరాబాద్ కోఠి ప్రాంతంలో జరిగిన కాల్పుల ఘటనపై ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి కీలక వివరాలు వెల్లడించారు. కోఠిలోని ఎస్బీఐ ఏటీఎం వద్ద నగదు డిపాజిట్ చేయడానికి వచ్చిన రిన్షద్‌పై దుండగులు కాల్పులు జరిపినట్లు తెలిపారు. ఈ ఘటన ఉదయం ఆరు గంటల యాభై నిమిషాల నుంచి ఏడు గంటల మధ్యలో చోటుచేసుకుందని స్పష్టం చేశారు. నాంపల్లి ప్రాంతానికి చెందిన బట్టల వ్యాపారి రిన్షద్ ఆరు లక్షల రూపాయలను డిపాజిట్ చేయడానికి ఏటీఎం వద్దకు వచ్చాడని డీసీపీ వివరించారు. అతను నగదు డిపాజిట్ చేస్తున్న విషయాన్ని ముందుగానే గమనించిన దుండగులు రికీ నిర్వహించి దాడికి పాల్పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. కాల్పులు జరపడంతో రిన్షద్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడని తెలిపారు. దుండగులు రిన్షద్ తీసుకొచ్చిన ఆరు లక్షల నగదుతో పాటు రషీద్‌కు చెందిన బైక్‌ను ఉపయోగించి పరారైనట్లు పోలీసులు గుర్తించారు. గాయపడిన రిన్షద్‌ను వెంటనే ఆసుపత్రికి తరలించగా, అతను ప్రాణాలతో లేడని వైద్యులు నిర్ధారించినట్లు డీసీపీ శిల్పవల్లి వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. ఐదు ప్రత్యేక బృందాలతో పాటు సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా దుండగుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు చెప్పారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పోలీసులు ధీమా వ్యక్తం చేశారు.

## జూబ్లీహిల్స్ ఏసీపీకి మాజీ సీఎం కేసీఆర్ లేఖ

- ఫిబ్రవరి 1న విచారణకు సిద్ధమని స్పష్టీకరణ
- నోటీసుల జారీపై చట్టపరమైన అభ్యంతరాలు



**హైదరాబాద్, జనవరి 31**

జూబ్లీహిల్స్ ఏసీపీకి మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కె. చంద్రశేఖర్ రావు లేఖ రాశారు. క్రైమ్ నంబర్ 243/2024 విచారణకు సంబంధించి తన వివరణను ఈ లేఖలో వెల్లడించారు. బాధ్యతాయుత పౌరుడిగా, ప్రతిపక్ష నేతగా విచారణకు పూర్తిగా సహకరిస్తానని స్పష్టం చేస్తూ, ఫిబ్రవరి 1వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. నంది నగర్‌లోని తన నివాస గోడపై నోటీసులు అతికించడం పట్ల కేసీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చట్ట విరుద్ధంగా నోటీసులు అతికించడం రాజ్యాంగ విరుద్ధమని లేఖలో పేర్కొన్నారు. అరవై ఐదు సంవత్సరాలు దాటిన వ్యక్తులను వారి నివాసం వద్దే విచారించాలని చట్టం స్పష్టంగా చెబుతోందని గుర్తుచేశారు. తన ప్రస్తుత నివాసం ఎర్రవల్లిలో ఉందని, అక్కడే విచారణ జరపాలని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఏసీపీకి తనను విచారించే అధికార పరిధి లేదని కేసీఆర్ అభిప్రాయ పడ్డారు. నోటీసుల జారీ విషయంలో పోలీసులు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉల్లంఘించారని ఆరోపించారు. సతేందర్ కుమార్ యాంటిల్ వర్సెస్ సీబీఐ కేసు తీర్పును ఉదహరిస్తూ, సెక్షన్ 160 నోటీసులకు ఎన్నికల అఫిడవిట్‌లోని చిరునామాకు సంబంధం లేదని స్పష్టంచేశారు. ప్రస్తుతం నివసిస్తున్న చిరునామాలోనే విచారణ జరపాలని పార్లమెంట్ చట్టం చెబుతోందని లేఖలో పేర్కొన్నారు. హరీష్ రావుకు ఇచ్చిన నోటీసుల విషయంలో పోలీసులు డబుల్ స్టాండర్డ్స్ పాటిస్తున్నారని కేసీఆర్ విమర్శించారు. పోలీసుల చర్యలు కోర్టు ధిక్కరణ కిందకే వస్తాయని హెచ్చరిస్తూ, అక్రమ పద్ధతిలో ఇచ్చిన నోటీసులను తాను విస్మరించే హక్కు ఉందని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో నోటీసులన్నీ ఎర్రవల్లి చిరునామాకే పంపాలని పోలీసులకు సూచించారు. ఏపీ హైకోర్టులోని 'వీడీ మూర్తి' కేసు తీర్పును కూడా లేఖలో ప్రస్తావిస్తూ, పోలీసుల చర్యలు తన వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించేలా ఉన్నాయని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

## వనదేవతలను దర్శించుకున్న మహబూబాబాద్ ఎస్పీ దంపతులు



**మేడారం, జనవరి 31**

మేడారం సమ్మక్క సారలమ్మలను మహబూబాబాబాద్‌జిల్లా ఎస్పీ దంప తులు ఎస్పీ శబరీష్ హన్మకొండ కలెక్టర్ దివ్య శబరీష్ శనివారం తాడ్వా యి మండలం మేడారం దర్శించుకుని మొక్కులను సమ్మర్పించారు.

# కేసీఆర్‌పై రాజకీయ కక్షపూరిత దాడులు ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనం

- ఆధారాల్లేని ఆరోపణలు ప్రజాస్వామ్యానికి విరుద్ధం
- సింగరేణి అంశంపై సమాధానం చెప్పాలి - తెలంగాణ ప్రజలు కేసీఆర్ వెంటే నిలబడ్డారు




**హైదరాబాద్, జనవరి 31**

తెలంగాణ జాతి పిత, కోట్లాది ప్రజల విశ్వాస ప్రతీక అయిన కె. చంద్రశేఖర్ రావుపై రాజకీయ కక్షతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న చర్యలు ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనమని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. స్వరాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించి, దశాబ్దకాలం పాటు తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించిన మహానేతపై కక్షపూరితంగా వ్యవహరించడం అత్యంత దురదృష్టకరమని ఆయన అన్నారు. ఆధారాలు లేని ఆరోపణలు చేస్తూ, సిట్ పేరుతో నోటీసులు జారీ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి, రాజ్యాంగ విలువలకు పూర్తిగా విరుద్ధమని కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు. పరిపాలనలో ఎదురవుతున్న వైఫల్యాలను దాచిపెట్టేందుకు, ప్రజల సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకోవడం అనుచితమని విమర్శించారు. ఇలాంటి చర్యలతో ప్రభుత్వం తన అశక్తిని బయటపెడుతోందని అన్నారు. సింగరేణి బొగ్గు అంశంపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన సమయంలో, కేసీఆర్‌పై దాడులు చేయడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ రాజకీయ కక్షపూరిత ధోరణిని స్పష్టంగా చూపుతోందని కౌశిక్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా, రాజకీయ ఆరోపణలతో కాలం వెళ్లదీయడం ప్రభుత్వ అహంకారానికి నిదర్శనమని అన్నారు. కేసీఆర్ గారి వ్యక్తిత్వాన్ని, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో ఆయన చారిత్రక పాత్రను ఇలాంటి ప్రయత్నాలతో మలినం చేయడం ఎవరికీ సాధ్యం కాదని పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలంతా కేసీఆర్ వెంటే అచంచలంగా నిలబడి ఉన్నారని ఈ ప్రభుత్వం గుర్తించాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే రాజకీయ కక్షపూరిత చర్యలను తక్షణమే విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ వేగవంతం చేయాలి

- మ్యాపింగ్‌లో తప్పులకు తావులేకుండా ఇంటింటి సర్వే
- బూత్ లెవల్ అధికారుల ఫీల్డ్ విజిట్లు తప్పనిసరి - జగిత్యాలలో 69.94 శాతం పూర్తి: కలెక్టర్




హైదరాబాద్, జనవరి 31

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి మ్యాపింగ్ శాతాన్ని పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఐడిఓసి కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్‌లో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి ఇంటి నుంచి ఖచ్చితమైన వివరాలు సేకరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. మ్యాపింగ్ శాతాన్ని పెంచేందుకు బూత్ లెవల్ అధికారులు తప్పనిసరిగా ఫీల్డ్ విజిట్లు చేయాలని, ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల వివరాలను నిర్ధారించాలని ఆదేశించారు. తప్పు ఎంట్రీలు, తప్పు లింకింగ్‌లు జరగకుండా అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు వెంటనే తమ బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటర్ల సౌలభ్యం కోసం "బుక్ ఎ కాల్" సదుపాయంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని, ప్రతి ఓటరు పేరు సరైన పోలింగ్ స్టేషన్‌కు మ్యాప్ కావడం ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో అధికారులు, సిబ్బంది పూర్తి బాధ్యతతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఇప్పటివరకు 69.94 శాతం పూర్తయ్యిందని తెలిపారు. వంద శాతం పూర్తి చేసే దిశగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మ్యాపింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తూ, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి ఓటరు మ్యాప్ అయ్యేలా ప్రతి ఇంటి నుంచి ఖచ్చితమైన, నిర్దిష్టమైన వివరాలు సేకరించాలని అన్ని స్థాయిల అధికారులకు సూచించారు.

# మున్సిపల్ ఎన్నికల వేళ బీఆర్ఎస్‌లో చేరికలు

- బీజేపీ సీనియర్ నేత రిక్కాల ఇంద్రసేనారెడ్డి పార్టీ మార్పు
- కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లోకి ఆహ్వానం - నాగార్జున సాగర్ రాజకీయాల్లో కీలక పరిణామం



**హైదరాబాద్, జనవరి 31**

మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. నాగార్జున సాగర్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ సీనియర్ నేత, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రిక్కాల ఇంద్రసేనారెడ్డి తమ అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ చేరికలు స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ఇంద్రసేనారెడ్డికి పార్టీ కండువా కప్పి, బీఆర్ఎస్‌లోకి ఆత్మీయంగా ఆహ్వానించారు. పార్టీ సిద్ధాంతాలు, తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలతో ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ఈ సందర్భంగా నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగార్జున సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, ఎమ్మెల్సీ కోటి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహ రెడ్డి పాల్గొన్నారు. అలాగే మాజీ జెడ్పీ చైర్మన్ గుజ్జ దీపికా యుగేందర్ రెడ్డి, మాజీ ఆప్కాబ్ చైర్మన్ ఎడవెల్లి విజేందర్ రెడ్డి కూడా ఈ కార్యక్రమంలో హాజరయ్యారు. బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లోకి జరుగుతున్న ఈ చేరికలు మున్సిపల్ ఎన్నికల వేళ పార్టీ బలాన్ని మరింత పెంచనున్నాయని బీఆర్ఎస్ నేతలు అభిప్రాయపడ్డారు. స్థానిక స్థాయిలో పార్టీ సంస్థాగత బలోపేతానికి ఈ పరిణామం కీలకంగా మారనుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.




## నో డైలాగ్స్.. సస్పెన్స్ ఎలిమెంట్స్‌తో అమరావతికి ఆహ్వానం టీజర్




ధన్య బాలకృష్ణ, ఎస్తర్ నోరోన్హా లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం అమరావతికి ఆహ్వానం జీవీకే దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో శివ కంఠమనేని, సుప్రిత, హరీష్, అశోక్‌కుమార్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే మేకర్స్ షేర్ చేసిన గ్లింప్స్‌లో కీటక మరణం కప్ప జీవనాధారం.. కప్ప మరణం పాము జీవనాధారం.. ఈ సృష్టి మొత్తం జనన మరణ పోరాటం. ఇది ఒక యుద్ధం.. ఒకరి గెలుపు మరొకరి అంతం.. అంటూ సాగుతున్న డైలాగ్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. ఈ మూవీ ఫిబ్రవరి 13న విడుదల కానుంది. తాజాగా ఈ మూవీ టీజర్‌ను ప్రముఖ నటుడు, నిర్మాత మురళీమోహన్ లాంచ్ చేశారు. ఈ సారి డైలాగ్స్ లేకుండా సస్పెన్స్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఒళ్లు గగుర్పొడిచే భయానక సన్నివేశాలతో కట్ ట్రైలర్ మూవీ హైప్ క్రియేట్ చేస్తోంది. పద్మనాబ్ భరద్వాజ్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఈ సినిమాకు హైలెట్‌గా నిలుస్తుందని విజువల్స్ చెప్పకనే చెబుతున్నాయి. బలమైన కంటెంట్‌తో రాబోతున్న ఈ సినిమా ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటుందని డైరెక్టర్ జీవీకే ధీమా వ్యక్తం చేశాడు. భయాన్ని రేకెత్తించేలా ఉన్న టీజర్ దర్శకుడి టాలెంట్ చూపిస్తుందని.. బలమైన కంటెంట్‌తో వస్తున్న చిత్రం ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నానని మురళీ మోహన్ అన్నారు. తెలుగులో హార్రర్ థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో తెరకెక్కే సినిమాలకు మంచి రెస్పాన్స్ ఉంటుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇదే లైన్‌లోథ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో భయపెట్టించేందుకు రాబోతున్నట్టు టీజర్ హింట్ ఇచ్చేస్తుంది. ఈ చిత్రాన్ని లైట్ హౌస్ సినీ మ్యాజిక్ బ్యానర్‌పై కేఎస్ శంకర్ రావు, ఆర్ వెంకటేశ్వర రావు నిర్మిస్తున్నారు.

## సూర్య, వెంకీ సినిమా థియేటర్లలోకి వచ్చే టైం ఫిక్స్..!




కోలీవుడ్ యాక్టర్ సూర్య వరుస సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరితో చేస్తున్న సూర్య 46 ఈ చిత్రంలో ప్రేమలు ఫేం మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తుండగా.. సీనియర్ యాక్టర్లు రాధికా శరత్ కుమార్, రవీనా టాండన్లు కీలక పాత్ర పోషిస్తోంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర వార్త తెరపైకి వచ్చింది. ఇంకా టైటిల్ ఫిక్స్ కానీ ఈ మూవీ ఏప్రిల్‌లో థియేటర్లలోకి వస్తుందంటూ ఇప్పటికే న్యూస్ నెట్టింట రౌండప్ చేస్తుండగా.. ఈ మూవీని జులై 2026లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేలా ప్లాన్ చేస్తున్నారంటూ తాజాగా మరో అప్‌డేట్ తెరపైకి వచ్చింది. దీనిపై సూర్య టీం నుంచి అధికారిక ప్రకటన రావడమే ఆలస్యమని ఇన్‌సైడ్ టాక్. తాజా కథనాల ప్రకారం గజినీలో సంజయ్ రామస్వామి పాత్ర లైన్‌లో ఈ చిత్రంలో సూర్య రోల్ ఉండబోతుందని తెలుస్తోంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రం 45 ఏండ్ల వ్యక్తికి 20 ఏండ్ల యువతికి మధ్య రిలేషన్ షిప్ నేపథ్యంలో ఉండబోతుందట.. ఏజ్ గ్యాప్ ఎక్కువగా ఉన్న వీరిద్దరి మధ్య ప్రేమ చిగురిస్తుందా..? ఇద్దరి మధ్య ట్రాక్ ఎలా ఉండబోతుందనే నేపథ్యంలో సినిమా సాగనున్నట్టు సూర్య 46 చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ , ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశి, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో సూర్య టాలీవుడ్ ఎంట్రీ ఇస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. సూర్య మరోవైపు సుధాకొంగర డైరెక్షన్‌ల సూర్య 47లో నటిస్తున్నాడని తెలిసిందే

## షారుఖ్ ఖాన్ నా రోల్ మోడల్ : దళపతి విజయ్

బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ తనకు రోల్ మోడల్ లాంటివారని తెలిపాడు తమిళ స్టార్ హీరో, తమిళగ వెట్రి కళగం అధినేత దళపతి విజయ్. చెన్నై వేదికగా జరిగిన ఒక ప్రత్యేక మీడియా సమావేశంలో విజయ్ మాట్లాడుతూ.. తన రాజకీయ ప్రస్థానంతో పాటు జననాయగన్ విడుదల వివాదం, తన రోల్ మోడల్ గురించి స్పందించాడు. షారుఖ్ అంటే తనకి ఇష్టమని చెప్పిన విజయ్.. అతడిపై ప్రశంసల జల్లు కురిపించారు. షారుఖ్ ఖాన్ మాట్లాడే తీరు, ఆయన వ్యక్తిత్వం తనను ఎంతగానో ప్రభావితం చేశాయని, అందుకే ఆయన్ని తన రోల్ మోడల్‌గా భావిస్తానని స్పష్టం చేశారు. ఇక గతంలో 'జవాన్' సినిమా షూటింగ్ సమయంలో వీరిద్దరూ కలిసి దిగిన ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో ఎంతటి సంచలనం సృష్టించాయో అందరికీ తెలిసిందే.

# దుబాయ్‌లో అల్లు శిరీష్-నయనిక ప్రీ వెడ్డింగ్ సంబరాలు..

## వైరల్ అయిన అల్లు అర్జున్ షర్ట్ రేటు !

ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ చిన్న కుమారుడు, హీరో అల్లు శిరీష్ త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నాడు. తన ప్రేయసి నయనికను ఈ ఏడాది మార్చిలో పెళ్లి చేసుకోనున్న శిరీష్, పెళ్లికి ముందే దుబాయ్‌లో గ్రాండ్‌గా ప్రీ వెడ్డింగ్ పార్టీ నిర్వహించాడు. కుటుంబ సభ్యులు, సన్నిహిత మిత్రులతో కలిసి జరిగిన ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. మార్చిలో జరిగే వివాహానికి ముందు శిరీష్-నయనిక జంట దుబాయ్‌లో ఫ్యామిలీ అండ్ ఫ్రెండ్స్ కోసం ప్రత్యేకంగా ఈ పార్టీని ప్లాన్ చేశారు. అల్లు అర్జున్ - స్నేహారెడ్డి దంపతులతో పాటు అల్లు కుటుంబం మొత్తం ఈ సంబరాల్లో పాల్గొంది. జే1 బీచ్ ప్రాంతంలో, సముద్రంలో ప్రయాణిస్తున్న బోటులో జరిగిన పార్టీ వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. పార్టీలో శిరీష్ షాంపైన్ బాటిల్ ఓపెన్ చేసి స్ప్రే చేయగా, చుట్టూ ఉన్న అతిథులంతా చప్పట్లతో హోరెత్తించారు. ఆ సమయంలో పక్కనే నిలబడ్డ అల్లు అర్జున్ నవ్వుతూ కనిపించాడు. శిరీష్, నయనిక ఇద్దరూ షాంపైన్‌ను




షేర్ చేసుకుంటూ తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వీడియోలు అభిమానులను బాగా ఆకట్టుకుంటున్నాయి.ఈ ప్రీ వెడ్డింగ్ పార్టీకి సంబంధించిన మరో హాట్ టాపిక్... అల్లు అర్జున్ ధరించిన షర్ట్. జే1 బీచ్‌లో తీసిన వీడియోలో స్నేహారెడ్డి వైట్ కలర్ డ్రెస్‌లో స్టైలిష్‌గా కనిపించగా, అల్లు అర్జున్ మాత్రం వెర్సాస్ ప్రింటెడ్ సిల్క్ ట్విల్ షర్ట్తో అదిరిపోయాడు.ఆ బ్రాండ్ అధికారిక వెబ్‌సైట్ సమాచారం ప్రకారం, ఈ షర్ట్ ధర రూ.1,39,600 కావడం విశేషం. దీంతో అల్లు అర్జున్ లుక్ మరోసారి ఫ్యాషన్ ప్రియుల దృష్టిని ఆకర్షించింది.అల్లు శిరీష్ తన తాత, దిగ్గజ నటుడు అల్లు రామలింగయ్య జయంతి సందర్భంగా నయనికను వివాహమాడనున్నట్లు అక్టోబర్ 1, 2025న అధికారికంగా ప్రకటించాడు. ఈ జంట అక్టోబర్ 31, 2025న హైదరాబాద్‌లో అత్యంత వైభవంగా ఎంగేజ్‌మెంట్ చేసుకుంది. మార్చి 6, 2026న శిరీష్--నయనిక వివాహం జరగనుండగా, ఇదే రోజు అల్లు అర్జున్ -- స్నేహారెడ్డి మ్యారేజ్ డే కావడం మరో విశేషం. ఇటీవల ట్రెండింగ్‌లో ఉన్న ఓ రీల్ ద్వారా ఈ పెళ్లి తేదీని శిరీష్ స్వయంగా వెల్లడించాడు.మొత్తానికి, అల్లు కుటుంబంలో మరో పెళ్లి వేడుకకు కౌంట్‌డౌన్ మొదలవ్వగా... దుబాయ్ ప్రీ వెడ్డింగ్ పార్టీతో సంబరాలకు ఇప్పటికే స్టార్ట్ పడిపోయింది.

# నాకు ముందే తెలుసు..

## జననాయగన్ ఆలస్యంపై విజయ్ కామెంట్స్ వైరల్






కోలీవుడ్ స్టార్ యాక్టర్ దళపతి విజయ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం జన నాయగన్. తెలుగులో ప్రజల నాయకుడు టైటిల్‌తో వస్తోంది. ఈ చిత్రం ముందుగా నిర్ణయించిన ప్రకారం జనవరి 9నే ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కావాల్సి ఉంది. అయితే జననాయ గన్‌కు సెన్సార్ బోర్డ్ సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో విజయ్ టీం మద్రాస్ హైకోర్టును ఆశ్రయిం చింది. రాజకీయ కారణాలతో జననాయగన్ సినిమాకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఇప్పటికే టీవీకే ఆరోపిస్తోంది. కాగా ఇటీవలే సెన్సార్ బోర్డు సుప్రీం కోర్టు కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. ఒకవేళ నిర్మాతలు ఏదైనా అప్పీలు చేస్తే తమ వాదనలు వినకుండా ఎలాంటి ఆదేశాలు జారీ చేయొద్దని సెన్సార్ బోర్డు అత్యున్నత న్యాయస్థానాన్ని కోరింది. అయితే ఇప్పటివరకు సినిమా చిక్కులకు సంబంధించి ఎలాంటి కామెంట్ చేయలేదు. దీంతో అభిమానులు తీవ్ర నిరాశలో మునిగిపోతున్నాయి. తాజాగా దీనిపై క్లారిటీ ఇచ్చేశాడు విజయ్. ఓ నేషనల్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నా పొలిటికల్ ఎంట్రీ కారణంగా నా జననాయగన్ మూవీ నిర్మాత ఇబ్బందులు పడుతుం డటం బాధగా ఉంది. నా రాజకీయా రంగేట్రం వల్ల నా సినిమా ప్రభావి తమవుతుందని తెలుసు. దీనిపై నేను ముందే మానసికంగా సిద్ధమయ్యానన్నాడు విజయ్. సుమారు 500 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తు న్నారు. మరి సెన్సార్ సమస్యలు ఎప్పుడు క్లియరవుతాయి.. సినిమా విడుదల ఎప్పుడు అవుతుందనేది డైలామా నెలకొంది. కార్తీ (ఖాకీ) ఫేం హెచ్. వినోద్ దర్శకత్వం వహిస్తున్నఈ చిత్రం నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన ఫస్ట్ లుక్, ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ మూవీకి అనిరుధ్ సంగీతం అందిస్తుండగా.. కన్నడ టాప్ బ్యానర్ కేవీఎన్ ప్రొడక్షన్ నిర్మిస్తోన్న ఈ మూవీలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ కీ రోల్‌లో కనిపించ నున్నారు. మమితా బైజు, గౌతమ్ వాసుదేవ్ మీనన్, ప్రకాష్ రాజ్, ప్రియమణి కీలకపాత్రల్లో నటిస్తున్నారు.

# ఓటీటీలోకి 'మన శంకర వరప్రసాద్ గారు'..



ఈ సంక్రాంతి కానుకగా థియేటర్లలో విడుదలై రీజనల్ ఇండస్ట్రీలో హిట్‌గా నిలిచిన చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు'. మెగాస్టార్ చిరంజీవి హీరోగా, కమర్షియల్ ఎంటర్‌టైనర్లకు కేరాఫ్ అడ్రస్‌గా పేరొందిన అనీల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా విడుదలైనప్పటి నుంచి బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో దూసుకెళ్లింది. కుటుంబ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్న ఈ చిత్రం ఇప్పటికీ థియేటర్లలో మంచి రన్‌ను కొనసాగిస్తోంది. ఇప్పటికే థియేట్రికల్ రన్‌తో సూపర్ సక్సెస్ అందుకున్న 'మన శంకర వరప్రసాద్ గారు' ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమ వుతోంది. ఈ సినిమాకు సంబంధి ంచిన ఓటీటీ హక్కులను ప్రముఖ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ జీ5 సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం ఫిబ్రవరి 11 నుంచి ఈ సినిమా ఓటీటీలో స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రానుందని తెలుస్తోంది. తెలుగు మాత్రమే కాకుండా ఇతర పాన్ ఇండియా భాషల్లోనూ ఈ చిత్రాన్ని రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన ఇంకా రావాల్సి ఉంది.సినిమా విషయానికి వస్తే, చిరంజీవి ఎనర్జీ, టైమింగ్, కామెడీ పంచ్‌లతో మరోసారి ప్రేక్షకులను అలరించారు. ఆయనకు జోడిగా నయనతార హీరోయిన్‌గా నటించి కీలక పాత్ర పోషించింది. ఇక విక్టరీ వెంకటేష్ ప్రత్యేక అతిథి పాత్రలో కనిపించి సినిమాకు మరో ప్రధాన ఆకర్షణగా నిలిచారు. వెంకీ మామ కామియోకు థియేటర్లలో వచ్చిన స్పందన సినిమాకే హైలైట్‌గా మారింది. భీమ్స్ సంగీతం సినిమాకు అదనపు బలంగా నిలిచింది. పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ రెండూ ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. ఈ చిత్రాన్ని సాహు గారపాటి నిర్మించగా, సుష్మిత కొణిదెల సమర్పించారు. కమర్షియల్ ఎలిమెంట్స్, కుటుంబ కథ, హాస్యం, భావోద్వేగాలు అన్నింటిని బ్యాలెన్స్ చేస్తూ అనీల్ రావిపూడి ఈ సినిమాను ప్రేక్షకులకు నచ్చేలా మలిచారు.థియేటర్లలో ఇప్పటికే విజయవంతంగా దూసుకెళ్లిన 'మన శంకర వరప్రసాద్ గారు' ఓటీటీలోనూ అదే స్థాయి రెస్పాన్స్ అందుకుంటుందా లేదా అన్నది చూడాలి. ఫిబ్రవరి రెండో వారంలో డిజిటల్ రిలీజ్ ఖరారైతే, థియేటర్ మిస్ అయిన ప్రేక్షకులకు ఇది మంచి వినోదంగా మారనుంది.